నాణ్యత పాటించాలి

మోతీనగర్: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానందనగర్ రోడ్డు నంబర్ 8 నుంచి 11 లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ కుమారుడికి అథ్లెటిక్స్‌లో మొదటి స్థానం

అభినందించిన డిపో మేనేజర్



మూసాపేట: కూకట్‌పల్లి డిపోకు చెందిన కండక్టర్ బి. మోహన్ కుమారుడు బానోత్ అకిరానందన్ మొరాకో దేశంలో జరిగిన అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం డిపో మేనేజర్ హరి అకిరానందన్‌ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్‌లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బాలానగర్: పాన్ షాప్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి నగర్‌లో ఓం సాయిరాం పాన్ షాప్‌లో బికాస్ దాస్ (38) అనే వ్యక్తి గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో బాలానగర్ పోలీసులు దాడి చేశారు. పాన్ షాప్‌లో లభించిన 59 చాక్లెట్లను సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కృష్ణారావుతో కలిసి కేటీఆర్‌కు అందజేస్తున్నకార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ - కూకట్‌పల్లి

భూసేకరణ లేని ప్రాంతంలో..
నాలా పనులు ప్రారంభించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్

కూకట్‌పల్లి: వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో భూసేకరణ లేని ప్రాంతంలో నాలా పనులు ప్రారంభించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద వాటర్ స్టాగ్నేషన్ పాయింట్‌ను, ఐడీపీఎల్ చెరువు సర్ ప్లస్ నాలా, ఆర్టీసీ డిపో వరకు ఉన్న ఎస్ఎన్‌డీపీ నిధులతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. కైత్లాపూర్ రోడ్డు వెడల్పు పనుల్లో జాప్యంపై ఆరా తీశారు. కోర్టు కేసు ఉన్నందున మొదలు పెట్టలేదని ఇంజినీర్ చెప్పటంతో కౌంటర్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ విషయంలో జోనల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంబేడ్కర్ నగర్ కోర్టు ప్రాంగణంలో లైనింగ్ ప్రాంతంలో వాటర్ స్టాగ్నేషన్ సమస్య పరిష్కారానికి 90 ఎంఎం డయా పైపులైన్ వేయటానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. జలమండలి ఎండీ సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అనంతరం హిందూ శ్మశాన వాటిక నిర్వహణను పరిశీలించి పక్కనే ఉన్న యానిమల్ కేర్ సెంటర్‌ను, కుక్కల ఆపరేషన్ సెంటర్‌లో గదిని పరిశీలించారు. జేఎన్‌టీయూకి వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, జోనల్ ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈలు రమేష్, శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలను సన్మానించిన ఎమ్మెల్యే



మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: స్టేట్ పవర్ లిఫ్టింగ్‌లో మూసాపేట, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పాతపల్లి శివకుమార్ 59 కేజీల కేటగిరిలో మొదటి బహుమతి, రమేష్ యాదవ్ 66 కేజీల విభాగంలో ద్వితీయ బహుమతి, ప్రదీప్ యాదవ్ 115 కేజీల బెంచి ప్రెస్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలవడంతో ఆయన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గానికి చెందిన యువత క్రీడల్లో విజయం సాధించటం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ నగర్ అధ్యక్షుడు పాతపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

పీఏసీ ఛైర్మన్ గాంధీ



సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ ఛైర్మన్ గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధిలో శేరిలింగంపల్లి నియోజకర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని ఈస్ట్ సాయినగర్, మొగులమ్మ బస్తీ, పీజేఆర్ నగర్, దత్తాత్రేయ నగర్, శంషీగూడ, ఇంద్రహిల్స్, హెచ్ఎంటీ శాతవాహననగర్, జయనగర్ కాలనీల్లో రూ.2.48 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రివాల్వింగ్ గేటును ఏర్పాటు చేయాలి



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ మెట్రో స్టేషన్ నుంచి విశ్వ విద్యాలయంలోకి నేరుగా వచ్చేలా రివాల్వింగ్ గేటును ఏర్పాటు చేయాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం యూనివర్సిటీ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జేఎన్‌టీయూహెచ్ ప్రధాన ద్వారం వద్ద ట్రాఫిక్ అధికంగా ఉంటున్నందున ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు వందలాది మంది రోజు మెట్రో ద్వారా యూనివర్సిటీకి వస్తున్నారని, మెట్రో స్టేషన్ నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు నడిచి విశ్వ విద్యాలయానికి రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీంతో పలువురు విద్యార్థులు మొదటి తరగతిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేస్తామని విద్యార్థులకు అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పూల అరవింద్ కుమార్, గోపాల చంద్రశేఖర్, శివకృష్ణ, బ్రహ్మం గౌడ్, రోహిత్ పాల్గొన్నారు.

వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



చెంచారావు (ఫైల్)

మూసాపేట: పార్కులో వాకింగ్‌కు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి వెంకట్రావు నగర్‌లో నివాసం ఉండే కొల్ల చెంచారావు (63) రిటైర్డ్ ఉద్యోగి. రోజులాగే వెంకటరావు నగర్ కాలనీలోని పార్కులో మంగళవారం వాకింగ్‌కి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీతో కోడలు గీతిక సృజన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త సీవరేజీ లైన్ అవసరం



కమల ప్రసన్ననగర్‌లో సీవరేజ్ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి, అధికారులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని కమల ప్రసన్ననగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రో వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులతో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మంగళవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమల ప్రసన్ననగర్ రోడ్డు నంబర్ 12, 13లలో సీవరేజ్ లైన్‌లు చిన్నవిగా ఉండటంతో తరచూ మురుగునీరు రోడ్డుపైకి వస్తోందన్నారు. కొత్తగా లైన్ వేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో మంజూరు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. అదే విధంగా సిమెంట్ రోడ్డు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీఈ మేనేజర్ ప్రియాంక, జీహెచ్ఎంసీ నిఖిల్, కాలనీ అధ్యక్షులు శేఖర్, రాఘవులు, ఆంజనేయులు, రాజు, శ్రీశైలంగౌడ్, రాము, తిరుపతి, బండప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వలసదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: వీసా గడువు ముగిసినా దేశంలో ఉన్న అక్రమ వలసదారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రభుత్వానికి, త్రివిధ దళాలకు భారత పౌరులుగా మనమంతా సహకరించాలన్నారు. అక్రమంగా దేశంలో ఉంటున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్ తదితరులను దేశం విడిచి వెళ్లేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్‌గౌడ్, పవన్, గోపి, సోమశేఖర్, భగవంత్, రవి, రమేష్, రాములు, కోటేశ్వరరావు, లహరి, సూరి, ప్రేమ్, వెంకటరమణ పాల్గొన్నారు.